# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 18-10-2025 సమయం : రాత్రి 8 గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాలు సామాన్య ప్రజానీకానికి చేరుతున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.

- ❖ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద 5జీ నెట్‌వర్క్ దేశంగా భారత్ నిలిచిందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

- ❖ బ్రహ్మోస్ కేవలం ఒక క్షిపణి మాత్రమే కాదని, స్వదేశీ సామర్థ్యానికి ప్రతీక అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26న ప్రసారమవుతుంది.

- ❖ అల్పపీడనం కారణంగా రాబోయే రెండు రోజుల్లో కేరళ, తమిళనాడు, లక్షద్వీప్, పుదుచ్చేరి ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది.

========================

జీఎస్టీ 2.0 సంస్కరణల ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన ఊతం లభించిందని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. 'జీఎస్టీ బచత్ ఉత్సవ్' సందర్భంగా ఈ రోజు న్యూఢిల్లీలో కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, పీయూష్ గోయల్‌తో కలిసి ఆమె సంయుక్త పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాలు సామాన్య ప్రజానీకానికి చేరుతున్నాయని తెలిపారు. పండుగ సీజన్‌లో ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, వినియోగదారుల వస్తువులు వంటి కీలక రంగాలలో రికార్డు స్థాయిలో అమ్మకాలు నమోదయ్యాయని నిర్మలా సీతారామన్ పేర్కొంటూ…

(వాయిస్ 30 సెకన్లు)

ఈ సందర్భంగా కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ... ఈ ఏడాది నవరాత్రి ఉత్సవాలలో రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిగాయని తెలిపారు. గత నవరాత్రి పండుగతో పోలిస్తే ఈసారి ఎలక్ట్రానిక్స్ అమ్మకాలలో 25 శాతం పెరుగుదల కనిపించిందని ఆయన పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణల వల్ల ఆహార ధరలు తగ్గుతున్నాయని, ఎలక్ట్రానిక్స్ వస్తువులకు పెరుగుతున్న డిమాండ్ ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి నేరుగా ప్రయోజనం చేకూరుస్తోందన్నారు. అదేవిధంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా అస్థిర పరిస్థితులు ఉన్నప్పటికీ, దేశ ఆర్థికవృద్ధి గణనీయంగా పెరిగిందని, దీని కారణంగా అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సైతం భారతదేశ వృద్ధి అంచనాను 6.6 శాతానికి సవరించిందని వివరించారు.

=======================

దేశవ్యాప్తంగా ఈ రోజు 'ధన్‌తేరాస్' పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఈ పర్వదినం నుంచే దీపావళి సంబరాలు ప్రారంభమవుతాయి. ధన్‌తేరస్ తరువాత నరక చతుర్దశి, దీపావళి, గోవర్ధన పూజ, భాయ్‌దూజ్ పండుగలను జరుపుకొంటారు. ధన త్రయోదశి లేదా ధన్వంతరి జయంతి అని కూడా పిలిచే ఈ ధన్‌తేరస్ రోజున ప్రజలు ధన్వంతరి స్వామి, కుబేరుడు, లక్ష్మీదేవిని పూజిస్తారు. హిందూ పంచాంగం ప్రకారం, అశ్విని మాసంలోని కృష్ణ పక్షంలో పదమూడో రోజున ఈ పండుగను పాటిస్తారు. ఈ రోజును కొత్త వస్తువులు, ముఖ్యంగా బంగారం లేదా వెండి వస్తువులు కొనుగోలు చేయడానికి ప్రజలు చాలా శుభప్రదమైన రోజుగా భావిస్తారు.

=======================

ధన్‌తేరస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికీ సుఖసంతోషాలు, మంచి ఆరోగ్యం కలగాలని ప్రధానమంత్రి ఈ రోజు సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు. ధన్వంతరి స్వామి ఆశీస్సులు పౌరులందరిపై పుష్కలంగా ఉండాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఇక కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కూడా పౌరులకు ధన్‌తేరాస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల జీవితాల్లో ఆనందం, శ్రేయస్సు, అదృష్టం వెల్లివిరియాలని ధన్వంతరి స్వామిని ప్రార్థిస్తున్నట్లు సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

=======================

భారతదేశంలో 5జీ నెట్‌వర్క్ విస్తరణ వేగానికి ప్రపంచమంతా ఆశ్చర్యపోయిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ప్రస్తుతం దేశంలో 90 శాతం ప్రాంతానికి 5జీ నెట్‌వర్క్ కవరేజీ వుందని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన ఒక సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద 5జీ నెట్‌వర్క్ ఇప్పుడు భారతదేశంలో ఉందని, మారుమూల ప్రాంతాలకు సైతం కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. నకిలీ వీడియోలు, ఆడియోల (డీప్‌ఫేకలు) ముప్పును ఎదుర్కొనేందుకు త్వరలోనే ప్రభుత్వం కఠిన నిబంధనలను తీసుకొస్తుందని ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

=======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

=======================

బ్రహ్మోస్ క్షిపణి సామర్థ్యం యావత్ ప్రపంచానికి తెలుసునని, ఇకపై పాకిస్థాన్ ప్రాంతం మొత్తం బ్రహ్మోస్ క్షిపణి పరిధిలోకే వస్తుందని రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఉత్తరప్రదేశ్ లఖ్‌నవూలోని బ్రహ్మోస్ ఏరోస్పేస్ యూనిట్‌లో తయారైన తొలి బ్యాచ్ బ్రహ్మోస్ క్షిపణులను ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి రాజ్‌నాథ్ సింగ్ ఈ రోజు జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. బ్రహ్మోస్ కేవలం ఒక క్షిపణి మాత్రమే కాదని, స్వదేశీ సామర్థ్యానికి ప్రతీక అని అన్నారు. బ్రహ్మోస్ మిస్సైల్ సాంప్రదాయక వార్‌హెడ్, అత్యంత అధునాతన గైడెడ్ వ్యవస్థతో కూడిందని, సూపర్ సోనిక్ వేగంతో సుదూర లక్ష్యాలను ఛేదించగలదని తెలిపారు. రక్షణ ఉత్పాదక రంగంలో భారత్ తనదైన ముద్ర వేస్తోందని రాజ్‌నాథ్ సింగ్ తెలియజేస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

========================

రైల్వే కార్యకలాపాలకు సంబంధించి తప్పుదారి పట్టించే వీడియోలను షేర్ చేస్తున్న సామాజిక మాధ్యమ ఖాతాలపై కఠిన చర్యలు తీసుకుంటామని భారతీయ రైల్వే శాఖ హెచ్చరించింది. ఈ పండుగ సీజన్‌లో కొన్ని సోషల్ మీడియా ఖాతాలు పాత వీడియోలను, వాస్తవ విరుద్ధమైన వీడియోలను ప్రచారం చేస్తూ.. ప్రయాణీకులలో గందరగోళాన్ని సృష్టిస్తున్నాయని రైల్వే మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రయాణీకులలో అనవసరమైన ఆందోళన కలిగించడానికి కారణమైన 20కి పైగా సోషల్ మీడియా ఖాతాలను  రైల్వే అధికారులు గుర్తించారని పేర్కొంది. ఈ ఖాతాలపై ఎఫ్ఐఆర్‌లు (FIRs) నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించామని వెల్లడించింది.

========================

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా తొలి దశ నామినేషన్ పత్రాల పరిశీలన ప్రక్రియ ఈ రోజు ప్రారంభమయ్యింది. తొలి దశకు సంబంధించి మొత్తం 1,698 నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి ఈ నెల 20 వరకు గడువు ఉంది. మొదటి దశలో 18 జిల్లాల పరిధిలోని 121 అసెంబ్లీ నియోజకవర్గాలకు వచ్చే నెల 6వ తేదీన పోలింగ్ జరగనుంది.

========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా మూడవ వారం కూడా లాభాలు నమోదు చేశాయి. రెండో త్రైమాసికం (Q2) ఫలితాల నేపథ్యంలో సూచీలు పుంజుకున్నాయి. ఈ వారంలో బొంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) 30 షేర్ల సూచీ సెన్సెక్స్ 1,451 పాయింట్లు లాభపడి 83,952 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) నిఫ్టీ 50 సైతం 425 పాయింట్లు లాభపడి 25,710 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 72 పైసలు మెరుగుపడి, శుక్రవారం ముగింపు నాటికి 87 రూపాయల 97 పైసలు వద్ద స్థిరపడింది.

========================

ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (BWF) ఆధ్వర్యంలో గువాహటిలో జరుగుతున్న ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్స్ 2025లో భారత యువ క్రీడాకారిణి తన్వి శర్మ బాలికల సింగిల్స్ ఫైనల్స్‌కు ప్రవేశించింది. తన్వి ఈ ఘనత సాధించిన ఐదో భారతీయ షట్లర్‌గా చరిత్ర సృష్టించింది.

========================

నైరుతి అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం రాబోయే 36 గంటల్లో మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఈ రోజు వెల్లడించింది. దీని ప్రభావంతో దక్షిణ భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ అల్పపీడనం కారణంగా రాబోయే రెండు రోజుల్లో కేరళ, తమిళనాడు, లక్షద్వీప్, పుదుచ్చేరి ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

========================

========================